క్లుప్తంగా

విజేతలకు బహుమతులు ప్రదానం



డ్రా తీస్తున్న ఆర్ఎం సోలెమన్

ఎదులాపురం: ఆర్టీసీ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా లక్కీ డ్రా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా సోమవారం లక్కీ డ్రా నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పురుషుల విభాగంలో సుమన్, చిన్నరావ్, ఆనంద్, రమేశ్, లక్ష్మణ్, మహిళ విభాగంలో హజ్ర, సౌమ్య, మంగళ, కీర్తి తదితరులు విజేతులుగా నిలిచారు. రీజినల్ మేనేజర్ ఆదిలాబాద్ సోలెమన్, డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్ కుమార్, డిప్యూటీ ఆర్ఎంవో ప్రణీత్, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన, అకౌంటెంట్ మోహన్, స్టేషన్ మేనేజర్ వీఆర్ కృష్ణ, శ్రీకర్, రిజర్వేషన్ కౌంటర్ ఇన్‌చార్జి హుస్సేన్, ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులు పాల్గొన్నారు.

అశ్విన్‌రెడ్డిని కలిసిన ఆత్రం భాస్కర్



అశ్విన్‌రెడ్డితో భాస్కర్, నరేశ్‌జాదవ్

నేరడిగొండ: ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏలేటి అశ్విన్‌రెడ్డిని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ ఆశవాహ అభ్యర్థి ఆత్రం భాస్కర్, ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్‌లు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దౌలత్ రావు, రామ్ లక్ష్మణ్ గౌడ్, నరేశ్‌రెడ్డి, ఆత్రం మహేందర్, ఆత్రం కిషోర్, గుడాల అనీష్ కుమార్, అరుణ్ రెడ్డి, ఈర్ల శ్రీకాంత్, మద్దెల మహేశ్ పాల్గొన్నారు.

'కంది' మద్దతు కోరిన ఆత్రం భాస్కర్

ఇచ్చోడ: ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డిని సోమవారం ఆత్రం భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు కోరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానని మద్దతును ఇవ్వాలని వినతిపత్రం అందచేశారు. గత 40 సంవత్సరాల నుంచి గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తూ.. గిరిజనుల అభివృద్ధికి కృషి చేసినట్లు కందికి వివరించారు.

ఉద్యోగ నియామక పత్రం అందుకున్న జ్యోతి

బోథ్: గురుకుల ఉద్యోగ నియామకాల్లో ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించిన సొనాల గ్రామానికి చెందిన బోయినపల్లి జ్యోతి సోమవారం హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో నియామక పత్రం అందుకుంది. టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులకు జ్యోతి ఎంపికయింది. కాగా ఆమె డిగ్రీ అధ్యాపకురాలిగా స్థిరపడతానని తెలిపారు. తనకు నాలుగు ఉద్యోగాలు రావడంలో తన తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

7న జాబ్‌మేళా

ఎదులాపురం: ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 7న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీల్లో ఫీల్డ్ ఆఫీసర్లుగా పని చేసేందుకు 19 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు గల యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న పేర్కొన్నారు. రూ. 12 వేల నుంచి రూ. 15 వేల వరకు వేతనం, ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు. ఇంటర్మీడియేట్, ఆపై చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10.30 గంటల వరకు తమ విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 76599 78443 సంప్రదించాలన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎదులాపురం: ఉద్యోగులు ఏమైనా సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌లు అన్నారు. సోమవారం తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్– 1 ఆదిలాబాద్ శాఖ 2024 క్యాలెండర్, డైరీలను సంఘం నాయకులతో కలిసి డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి అల్లాడి రఘురాం, ముఖ్య సలహాదారు బ్రహ్మానంద రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు రమణ చారి, సహా అధ్యక్షుడు ఎం. శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రవీందర్ రాథోడ్, రాష్ట్ర నాయకులు అక్బర్, వెంకట్ రెడ్డి, సంతోశ్, వెంకట రమణ, శ్రీనివాస్, ప్రమోద్‌నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి.. దిగులు

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండుతున్న చెరువులు, బోర్లు
- ఆందోళనలో రైతులు



మత్తడివాగు ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

తాంసి: యాసంగిలో సాగు చేస్తున్న పంటలకు సాగునీటి సమస్య తీవ్రమవుతుండడంతో సాగు నీటిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవి ప్రారంభ సమయంలోనే భూగర్భజలాలు తగ్గి, బోరుబావుల ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. గ్రామాల శివారులోని వాగులు, చెరువుల్లో సైతం నీరు నిల్వ లేక ఎండిపోతున్నాయి. దీంతో రైతులు సాగు చేసిన పంటలు చేతికి వచ్చే వరకు సాగునీరు పూర్తిస్థాయిలో అందుతుందో లేదోనని ఆందోళనకు చెందుతున్నారు.

బోరుబావులపై ఆధారం..

తాంసి, భీంపూర్ మండలాలోని పలు గ్రామాల్లోని రైతులు ప్రధానంగా బోరుబావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. యాసంగిలో ప్రధానంగా జొన్న, గోధుమ, వేరుశనగ, పెసర, మినుము పంటలు అధికంగా సాగు చేశారు. తాంసి మండలంలోని తాంసి, గిరిగాం, పొన్నారి, హస్నాపూర్, పాలోది గ్రామాల్లో ఇప్పటికే బోర్లు ఎండిపోయాయి. ఈకారణంగా పంట దిగుబడులు సైతం తగ్గే అవకాశం ఉంది.

మత్తడివాగు ప్రాజెక్టులో..

తాంసి మండలం వడ్డాడి శివారులోని మత్తడివాగు ప్రాజెక్టు ద్వారా పలు గ్రామాలకు సాగునీరు అందుతోంది. ప్రతీ ఏడాది మత్తడివాగు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా మండలంలోని వడ్డాడి, జామిడి, కప్పర్ల, బండల్‌నాగాపూర్, సావర్గాం, గోట్కూరి, పొచ్చెర గ్రామాలకు చెందిన రైతులకు 8,500 ఎకరాలకు సాగునీరు అందుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా యాసంగి సీజన్‌లో ఫిబ్రవరి, మార్చి నెలలో నిండుగా కనిపించేది. కానీ ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే ప్రాజెక్టులో భారీగా నీరు తగ్గింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 274 మీటర్ల వద్ద నీరు నిల్వ ఉంది. ఏప్రిల్ చివరి వరకు నీరందితేనే పంటలు చేతికి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం నీటి నిల్వ భారీగా తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట చేతికి వస్తాదో? రాదో?



బోరులో నీరులేక తక్కువగా వస్తోంది. గతేడాది 12 స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించి జొన్న పంట నాలుగు ఎకరాల్లో సాగు చేశాను. ఈఏడాది కూడా జొన్న పంటను సాగుచేశాను. కానీ ఇప్పుడే బోరులో భూగర్భజలాలు అడుగంటాయి. మరింత నీరు తగ్గితే పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు.

– ఇప్ప విఠల్, రైతు, తాంసి

దిగుబడిపై ప్రభావం



యాసంగి సీజన్‌లో సాగుచేసిన పంటలు పూర్తిస్థాయిలో దిగుబడి వచ్చే వరకు సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. బోర్లలో నీరు తగ్గడంతో పంటలకు నీరు పూర్తిగా అందడం లేదు. బోరుబావులు అడుగంటిపోతున్నాయి. సాగునీటి ఎద్దడి తలెత్తితే జొన్న పంట దిగుబడిపై ప్రభావం పడుతుంది.

– వికాస్ రెడ్డి, రైతు, జామిడి

నాయకుల ముందస్తు అరెస్టు



మావల పోలీస్‌స్టేషన్‌లో నాయకులు



నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ ఆదిలాబాద్ పర్యటన నేపథ్యంలో సీపీఐ, సీపీఎం, తుడుందెబ్బ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.మల్లేష్, నాయకుడు బండి దత్తాత్రి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు గోడం గణేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వేకువ జామునే వారి ఇళ్లకు వెళ్లిన పోలీసులు వారిని అరెస్ట్ చేసి వాహనాల్లో ఆదిలాబాద్ రూరల్, మావల పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ప్రధాని బహిరంగ సభ ముగించుకుని బయలుదేరిన అనంతరం వారిని వదిలిపెట్టారు. ఎయిర్‌పోర్టు, రైల్వేలైన్, యూనివర్సిటీ ప్రకటించకుంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని కేంద్రాన్ని హెచ్చరించారు.

ఇంద్రవెల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదిలాబాద్ జిల్లా పర్యటన ఉండడంతో సోమవారం తెల్లవారు జామున తుడుందెబ్బ మండల నాయకులు సోయం రాందాస్, ఆర్క ఖమ్ము, గేడం భారత్‌లతో పాటు మరికొందరిని పోలీసు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రధానమంత్రి పర్యటనలో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేయకుండా ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు.

పరీక్షల్లో భయం వద్దు



పరీక్ష సామగ్రి అందజేస్తున్న నాయకులు

బోథ్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు భయపడకూడదని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర పాఠశాల విద్యార్థులకు పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం పరీక్ష సామగ్రి అందజేశారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు మున్సిఫ్, కార్యదర్శి ప్రేమ్, సంతోష్ పాల్గొన్నారు.

నగదు అందజేత

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల గ్రామపంచాయితీ పరిధిలోని పోతాగూడ 2 గ్రామానికి చెందిన జైకుంరం, సూరు యూత్ సభ్యులు సోమవారం కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆయనకు తెలుపగా వారికి రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు సంతోష్, రాజ్ మొహమ్మద్, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని అందూర్, కౌఠ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ జుగాది రావ్, రోహిదాస్, బీముడు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఖానాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోగల వినాయక్ చౌక్ ఫీడర్ అశోక్ రోడ్ ప్రాంతంలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రధాని పర్యటనతో ఒరిగిందేమీ లేదు

- కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్



మాట్లాడుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ: దేశ ప్రధాని పర్యటనతో జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. నాలుగు దశాబ్దాల తర్వాత ప్రధాని పర్యటనతో రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలే ఉంటాయని ఆశించిన వారికి నిరాశే ఎదురైందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నప్పటికీ జిల్లాకు న్యాయంగా దక్కాల్సిన ఆదిలాబాద్–నిర్మల్– ఆర్మూర్ రైల్వేలైన్, జిల్లాలో ఉన్న రైల్వేలైన్‌లకు అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు, గిరిజన విశ్వవిద్యాలయం, ప్రత్యేక నిధులు, ఎయిర్‌పోర్ట్, వ్యవసాయ ఆధార పరిశ్రమలు వస్తాయనుకుంటే కేవలం రాజకీయ ప్రచారానికి ప్రధాని పర్యటన జరిగిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జిల్లా ప్రజలు బీజేపీ నాయకుల కపట ప్రేమను గమనించి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. సమావేశంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వైస్ చైర్మన్ ఆడే వసంత్ రావ్, కిసాన్ చౌహాన్, పసుల చంటి, అల్లూరి ప్రవులు చందర్ రెడ్డి, రాజురెడ్డి, షేక్ అబుద్ పాల్గొన్నారు.


జిల్లా ప్రజలను మోసగించిన ప్రధాని

ఎదులాపురం: జిల్లా ప్రజలను ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి మోసగించారని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. సీసీఐ పునః ప్రారంభం, ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రమం, గిరిజన యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్క్ వంటి వాటి కోసం ఏళ్లుగా జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీ ఇందులో ఏ ఒక్కటైనా మంజూరు చేయకపోతాడా అని ఆశతో ఎదురు చూసినా ప్రజలకు నిరాశ మిగిల్చారు. ఇది జిల్లా ప్రజలను అవమాన పరచడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రజల మనోభావాలను దెబ్బతీసేందుకే ప్రధాని పర్యటన

కైలాస్‌నగర్: జిల్లా ప్రజల మనోభావాలను దెబ్బతీసేందుకే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన చేపట్టడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఒక ప్రకటనలో అన్నారు. సీసీఐ పరిశ్రమతో పాటు ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వే లైన్, విమానాశ్రయ ఏర్పాటు, టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణంపై ఆశలు పెట్టుకున్న ప్రజానీకానికి మరోసారి నిరాశ ఎదురైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ఓట్ల కోసమే సభ చేపట్టారని ఆరోపించారు.

బయటపడిన దేవత విగ్రహాలు



బయటపడిన విగ్రహాలు

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామ సమీపంలో గల భీమన్న గుట్టపై సోమవారం దేవత విగ్రహాలు బయటపడ్డాయి. సాయిమహరాజ్ కలలో విఘ్నేశ్వరుడు వచ్చి భీమన్న గుట్టపై విగ్రహాలు ఉన్నాయని తెలుపడం జరిగింది. విగ్రహాలకు పూజలు చేస్తే గ్రామాల్లో సుఖశాంతులు, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని చెప్పడంతో పెద్ద బుగ్గారం, చిన్నబుగ్గారం, సవర్గాం, కుంటాల, పట్‌పట్‌తండా ప్రజలు అధిక సంఖ్యలో చేరుకొని, వారి సమక్షంలో భీమన్న గుట్టపై ఉన్న విగ్రహాలను సాయి మహరాజ్, పూజారి శేఖర్‌లు బయటకు తీశారు. విగ్రహాలను ధాన్యంలో ఉంచి పూజలు చేశారు. విఘ్నేశ్వరుడు, శివలింగం, నాగప్రతిమ విగ్రహాలు బయటపడ్డాయి. కుంటాల(కె) గ్రామానికి చెందిన రాజగౌడ్ పాలాభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆసక్తిగా విగ్రహాలను తిలకించి పూజలు చేశారు.

'వరాలు ప్రకటించకపోవడం విచారకరం'



దీక్షలో కూర్చున్న సభ్యులు

కైలాస్‌నగర్: ప్రధానీ నరేంద్ర మోదీ ఆదిలాబాద్ జిల్లాకు ఎలాంటి వరాలు ప్రకటించకపోవడం విచారకరమని రైల్వేలైన్ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్ ఆరోపించారు. ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్‌కు నిధులు మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఆ కమిటీ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 49వ రోజుకు చేరాయి. ఎయిర్‌పోర్టు, రైల్వేలైన్, యూనివర్సిటీ ఏ ఒక్కదాన్ని ప్రకటించలేదన్నారు. దీక్షలో రామోజీ అంజనేయులు, బీడీ చారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన పాలన అందిస్తాం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ రూ.50 లక్షల నిధులతో మండల కేంద్రానికి మంజూరైన సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్నిరంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో నేరడిగొండ, ఇచ్చోడ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతంరెడ్డి, అల్లూరి శివారెడ్డి, దేవేందర్ రెడ్డి, సాబ్లే నానక్‌సింగ్, ప్రతాప్ సింగ్, సద్దాం, జహీర్, ఆడెపు రమేశ్ పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పోలియో చుక్కలు వేస్తున్న ఈశ్వరీబాయి

ఇంద్రవెల్లి: 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడ గ్రామానికి సందర్శించి అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుభద్ర, ఆశ వర్కర్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల పిల్లలకు పోలియో చుక్కలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సంచార జాతుల పిల్లలను గుర్తించి సోమవారం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. సంచార జాతుల పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేశామన్నారు. ఆయన వెంట సీహెచ్‌వో బ్రహ్మానందం రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కై లాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గిరిజనులు

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామ సమీపంలో పెన్‌గంగ నది ఒడ్డున ఉన్న గిరిజాయి దేవత ఆలయంలో గిరిజనులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాలకు గిరిజనులు పెద్దఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలో గొల్లఘాట్, తాంసి(కె), గుంజాల, భీంపూర్ గ్రామాలకు చెందిన ఆదివాసీలు పూజలు నిర్వహించారు. పిల్లపాపలతో సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. అనంతరం ఆలయం వద్ద సహపంక్తి భోజనాలు చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ రాజు



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న డీఈ రమేశ్

ఇంద్రవెల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ శాఖ డీఈ రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పథకంలో ఇంద్రవెల్లి మండలానికి రూ. 2 కోట్ల 75 లక్షల నిధులతో మంజూరయ్యాయని అన్నారు. కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, సోమోరే నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తాంసి: ఉపాధిహామీ నిధులతో మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. తాంసి జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్‌తో కలిసి రూ.12 లక్షలతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సీసీరోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని, త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామన్నయాదవ్, నారాయణ, నరేశ్, రాంరెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలకు అర్హులందరికీ లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు లబ్ధి పొందని వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రజాపాలన కేంద్రాల ఏర్పాటుకు ఆదేశించింది. ఈ మేరకు ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అధికారులు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. మూడు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ముగ్గురు ఉద్యోగులను నియమించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రాలు సేవలు అందిస్తాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ తెలిపారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ తెలిపారు. ఈ సేవ కేంద్రంలో ప్రధానంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల దరఖాస్తులను సరిచేయడం జరుగుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.